సాక్షి రంగారెడ్డి

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



నష్టాన్ని అంచనా వేయాలి

వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి, నష్టాన్ని అంచనా వేయాలని కల్టెకర్ ఆదేశించారు. 8లో▸



ఫిర్యాదులపై స్పందించండి

పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలపై వెంటనే స్పందించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశించారు. 8లో▸



సీజనల్‌పై అప్రమత్తత

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. 8లో▸

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్



కేశంపేట: తులవానిగడ్డలో మహిళలతో మాట్లాడుతున్న దివ్య దేవరాజన్ తదితరులు

కేశంపేట: మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని తులవానిగడ్డ (అల్వాల), కేశంపేట గ్రామాల్లో బుధవారం ఆమె అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలతతో కలిసి పర్యటించారు. తులవానిగడ్డలో స్వాతి మహిళా సంఘం సభ్యులతో మాట్లాడి బ్యాంక్ రుణాలపై అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ద్వారా జరిగే కార్యక్రమాల గురించి ఆరా తీశారు. భూతల్లి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, వ్యవసాయ అద్దె పరికరాల పనితీరును పరిశీలించారు. మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడే ఉన్న మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులతో మాట్లాడి కేంద్రం నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీపీఎంలు బాలరాజు, సూర్య, నర్సింహ, స్వర్ణలత, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్లు రవీందర్, మైత్రేయ, ఏపీఎంలు యాదగిరి, భగవంతు, ఎంపీఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకారం అందిస్తాం

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వలో బుధవారం సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ పర్యటించారు. గ్రామంలో మట్టి పాత్రలు తయారు చేస్తున్న వారితో మాట్లాడారు. మట్టి పాత్రల తయారీ, మార్కెటింగ్‌తో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధునిక టెక్నాలజీతో మట్టి పాత్రలు తయారు చేసే విధానంలో సెర్ప్ తరఫున సహకారం అందిస్తామని ఆమె తెలిపారు. ప్రభుత్వం మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా పాడి పశువులు, నాటుకోళ్ల పెంపకం, పాల్ప ఉత్పత్తులు, టైలరింగ్, బ్యూటీ పార్లర్‌తో పాటు పలు రకాల స్వయం ఉపాధి కోసం రుణ సాయం అందిస్తున్నట్లు చెప్పారు. వీటిని మహిళా సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కొండయ్య, సీసీలు రాజప్ప, ఎండీ నిఖిల్, ఎస్. లక్ష్మమ్మ, కె.అలివేలు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

తలకొండపల్లి: రైతులెవరూ పంట రుణమాఫీపై ఆందోళన చెందొద్దని, అర్హులైన రైతులందరికీ మాఫీ వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని గౌరిపల్లిలో భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను బుధవారం ఆయన ఏడీ ఆదిలక్ష్మి, మండల వ్యవసాయాధికారి రేణుక చక్రవర్తితో కలిసి పరిశీలించారు. అనంతరం తలకొండపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సింహారావు మాట్లాడారు. సాంకేతిక కారణలతో కొంతమందికి రుణమాఫీ కాలేదని తెలిపారు. ఇంటింటికీ తిరిగి వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారని చెప్పారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ అనంతరం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. పంటల సాగులో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

అధికారులకు ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సూచన



శంకర్‌పల్లి: మోకిలలోని లా పలోమా విల్లాలను బుధవారం చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు విల్లాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ విల్లాల యజమానులతో మాట్లాడారు. శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఫత్తేపూర్, రావులపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఫత్తేపూర్ రైల్వే గేటు నుంచి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని, శంకర్‌పల్లి చౌరస్తా-ఫత్తేపూర్ నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు త్వరతగతిన చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. రావులపల్లి ప్రధాన రహదారిని పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేష్, మండలాధ్యక్షుడు రాములు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్ తదితరులు ఉన్నారు.

రూపురేఖలు మార్చి.. విద్యార్థులను ఆకర్షించి



వెంకటాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల



హెచ్‌ఎం మల్లయ్య

మొయినాబాద్: విద్యార్థులు చక్కగా చదవాలంటే ముందుగా పాఠశాల వాతావరణం బాగుండాలి. మౌలిక వసతులు ఉండాలి. చాలావరకు ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. కానీ ఆ ప్రధానోపాధ్యాయుడు పనిచేసే చోట ముందుగా విద్యార్థులను పాఠశాల ఆకట్టుకునేలా ఉండాలని భావించారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తుల సహకారంతో పాఠశాల రూపురేఖలు మార్చి విద్యాబోధనకు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. ఆయనే మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య. వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా మల్లయ్య ఎనిమిదేళ్ల క్రితం వచ్చారు. ఆయన పాఠశాలకు వచ్చిన రోజు విద్యార్థులకు సరైన తరగతి గదులు లేవు. అప్పటికే ప్రభుత్వం కొత్త భవనం నిర్మించినా అసంపూర్తిగా ఉంది. టాయిలెట్స్ సరిగా లేవు. సైన్స్ ల్యాబ్ లేదు. విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, టేబుళ్లు లేవు. పాఠశాల ఆవరణంతా గుంతలుగా ఉంది. పాఠశాలలో ఉన్న ఈ వాతావరణాన్ని పూర్తిగా మార్చి విద్యార్థులను ఆకట్టుకునేలా తయారు చేయాలని సంకల్పించారు మల్లయ్య.

దాతలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్తుల సహకారంతో..

మొదట అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తి చేసేందుకు దాతల సహకారం తీసుకున్నారు. తరగతి గదులన్నీ బాగుచేయించి రంగులు వేయించారు. తరగతి గదుల్లో, గోడలపై సరస్వతీదేవి, భరతమాత, దేశ నాయకుల బొమ్మలు, సైన్స్, జీవ శాస్త్రం, గణిత శాస్త్రానికి సంబంధించిన బొమ్మలు వేయించారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాల ఆవరణలో మట్టి పోయించి చదును చేయించారు. మొక్కలు నాటి హరిత వనంలా తీర్చిదిద్దారు. ప్రాజెక్టు నిర్మాలయ సంస్థ సహకారంతో టాయిలెట్స్ ఏర్పాటు చేయించారు. ఆకృతి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ట్యాబ్స్ ఇప్పించడంతోపాటు సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేయించారు. ప్రైవేటు స్కూల్స్ సహకారంతో విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు, టేబుళ్లు వేయించారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు చదువులోనూ విద్యార్థులు ప్రతిభ చాటేలా కృషి చేశారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 9.3 జీపీఏ సాధించడంతోపాటు ఇంగ్లిష్ మీడియంలో వంద శాతం, తెలుగు మీడియంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు.

విద్యార్థులు మెచ్చిన టీచరమ్మ.. భాగ్యమ్మ



జ్వరం వచ్చిన విద్యార్థిని ఆప్యాయంగా పలుకరిస్తున్న హెచ్‌ఎం భాగ్యమ్మ(ఫైల్)

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న భాగ్యమ్మ పేద విద్యార్థులకు ఆపద వచ్చిందంటే చాలు ఆదుకునేందుకు ముందు వరుసలో ఉంటారు. ఇటీవల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ప్రణీత్‌కుమార్ అనే విద్యార్థికి కడుపునొప్పి వచ్చింది. తల్లిదండ్రులు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించగా అపెండిక్స్ ఉందని ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న భాగ్యమ్మ వెంటనే స్పందించి రూ.18,500 ఆర్థిక సాయం చేశారు. గత ఏడాది కొత్తూరులో హెచ్‌ఎంగా పని చేస్తున్న సమయంలో పాఠశాలలో విద్యార్థులకు భోజనం తయారు చేసే వంట ఏజెన్సీ కింద పని చేసే చంద్రమ్మ భర్త అకాల మరణం చెందారు. నిరుపేద అయిన చంద్రమ్మకు హెచ్‌ఎం ఆర్థిక సాయం చేశారు. కొత్తూరు పాఠశాలలో చదువుతున్న శిరీష తండ్రి మృతి చెందగా రూ.18వేలు ఆర్థిక సహాయం అందించారు.

పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద హెచ్‌ఎంగా పని చేసిన భాగ్యమ్మ గ్రామశివారులో ఉన్న ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడి పాఠశాల నిర్మాణానికి కృషి చేశారు. కొత్తూరులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసిన సమయంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలకు మరమ్మతులు చేయాలని న్యాట్కో పరిశ్రమను కోరగా వారు రూ.3కోట్లతో తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించారు. దిశ ఉదంతం వెలుగులోకి వచ్చాక కొత్తూరు పాఠశాలలో స్టూడెంట్ పోలీస్ కాడెట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ తరగతిని ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం షాద్‌నగర్‌లోని బాలుర ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టారు. ఇలా కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుడా పాఠశాలల అభివృద్ధిలో, విద్యార్థుల సంక్షేమంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. తన బాటలోనే సహ ఉపాధ్యాయులను నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

గుర్తుండేలా..



బడిని మార్చే 'సారు'



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం జంగయ్య

కడ్తాల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న జంగయ్య పాఠశాలలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. 2022 జనవరిలో బదిలీపై వచ్చారు. నాటి నుంచి పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. రెండేళ్లుగా పలువురు దాతలను కలుస్తూ పాఠశాల అభివృద్ధికి చేయూతనందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఇమిరిస్ సిరామిక్స్ కంపెనీ సహకారంతో పాఠశాల బ్లాక్ బి భవనానికి గ్రిల్స్ ఏర్పాటు చేయించారు.
- పాఠశాల రక్షణకోసం సొంతడబ్బులతో పాటు కొంత మొత్తం దాతలు సహకారంతో రూ.45 వేలు పోగు చేశారు. పాఠశాలలో నిరంతర నిఘా కోసం 8 సీసీ కెమెరాలను మానిటరింగ్ కోసం టీవీ ఏర్పాటు చేయించారు.
- పాఠశాలకు చెందిన 2021-22 బ్యాచ్ పదోతరగతి విద్యార్థి మారుతి ఐఐటీ వారణాసిలో సీటు సాధించగా ఉన్నత చదువుల కోసం సహచర ఉపాధ్యాయులతో పాటు, పలువురు దాతల సహకారంతో ఆర్థిక అందించేలా చేశారు.
- ఆటా ప్రతినిధుల సహకారంతో పాఠశాలకు విలువైన బ్యాండ్, మైక్ సెట్ ఇప్పించారు.
- ఎగుడు దిగుడుగా, గుంతలమయంగా ఉన్న పాఠశాల మైదానాన్ని గ్రామ పంచాయతీ, దాతల సహకారంతో రూ.1.20 లక్షల వెచ్చించి చదును చేయించారు. ఎస్‌జీఎఫ్ క్రీడలతో పాటు, అనేక క్రీడా పోటీలు నిర్వహించేందుకు అనువుగా తీర్చిదిద్దారు.
- విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఓ దాతను కలిసి సమస్యను వివరించారు. ఆయన సాయంతో విద్యార్థులకు శుద్ధమైన తాగునీటి వసతి కల్పించారు.
- పాఠశాలలో అధిక శాతం నిరుపేద విద్యార్థులే కావడంతో వారి సమస్యలతో పాటు, విద్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.
- పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతికి బాటలు వేస్తున్నారు.
- గతంలో ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్నారు. జంగయ్య సార్.. సేవలు మరువలేనివని గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

బాధ్యతగా భావిస్తా ..



నిరుపేద కుటుంబంలో పుట్టిన నాకు ఆ కష్టాలు ఏమిటో తెలుసు. అందుకే పేదరికంలో ఉన్న విద్యార్థికి సాయం చేయడం, వసతులు కల్పించడం బాధ్యతగా భావిస్తాను. పేద విద్యార్థుల సమగ్ర వికాసం, వసతులు, సౌకర్యాల కల్పనతోపాటు పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– జంగయ్య, హెచ్‌ఎం, బాలుర ఉన్నత పాఠశాల, కడ్తాల్

తడ'బడి'నా.. నిలబెట్టారు



తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్ (ఫైల్)

కొందుర్గు: కొందుర్గు దళితవాడలో 2000-2001 విద్యాసంవత్సరంలో 50 మంది విద్యార్థులతో ప్రారంభమైన పాఠశాల 2011లో ఉపాధ్యాయులు సరిగ్గా లేక విద్యార్థుల సంఖ్య 9కి పడిపోయింది. అది కాస్తా కొద్దిరోజుల్లోనే మూతబడింది. 2013లో పాఠశాలకు ప్రేమ్‌సాగర్, ఉషశ్రీ అనే ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వచ్చారు. వీరు ఇల్లిల్లూ తిరిగి తల్లిదండ్రులకు నచ్చజెప్పి విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించారు. 2013-14 విద్యా సంవత్సరానికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 30కి చేరింది. అంచలంచెలుగా పెరుగుతూ ఈ సంఖ్య 80కి చేరుకుంది. గ్రామస్తులు, దాతల సహకారంతో ఇద్దరు వలంటీర్లను నియమించుకొని పాఠశాలను మండలంలోనే ఆదర్శంగా నిలిపారు. ప్రస్తుతం ప్రేమ్‌సాగర్ ఇటీవల నిర్వహించిన పదోన్నతుల్లో కొందుర్గు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇక ఉషశ్రీ అంతకు ముందే 317 జీఓలో పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిపోయారు. ఈ పాఠశాల నుంచి 170 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం విశేషం. ప్రస్తుతం ఈ విద్యార్థుల్లో శ్రీలత కోదాడలో ఇంజనీరింగ్ చదువుతోంది. మరో విద్యార్థి ఎమ్‌సెట్‌లో 2,500 స్టేట్ ర్యాంక్ సాధించడంతోపాటు నీట్‌లో 370 మార్కులు సాధించింది.

170 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే గురుపూజోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఖైరతాబాద్ జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 170 మందిని ఎంపిక చేశారు. వీరిలో మండల నోడల్ అధికారులు ముగ్గురు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పది మంది, ప్రిన్సిపాల్స్ ఇద్దరు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎనిమిది మంది, స్కూలు అసిస్టెంట్లు 68 మంది, ఎస్జీటీలు 65 మంది, కస్తూర్బాగాంధీ పాఠశాలల స్పెషల్ అధికారి ఒకరు, ప్రైవేటు ఉపాధ్యాయులు 13 మంది ఉన్నారు. వీరికి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు డీఈఓ సుశీందర్‌రావు తెలిపారు.

'ఇంటికి వంద- బడికి చందా'



పాఠశాల గోడపై ఆకట్టుకుంటున్న మహనీయుల చిత్రాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అరకొర వసతులు.. శిథిల భవనాలు.. అపరిశుభ్ర వాతావరణం.. విద్యాభ్యాసం అంతంతే.. ఇవీ ప్రభుత్వ పాఠశాలలపై సాధరణంగా అందరికీ ఉండే అభిప్రాయాలు. కానీ ఆ పాఠశాలను చూస్తే ఆ అభిప్రాయం మార్చుకోవాల్సిందే. 'ఇంటికి వంద- బడికి చెందా' అనే నినాదంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం కాస్తా గ్రామస్తులను ఏకం చేసి పాఠశాల అభివృద్ధికి నడుం బిగించేలా చేసింది. ఆదర్శంగా నిలుస్తున్న ఆ పాఠశాలే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఒకప్పుడు రంగులు వెలసిన పాత గోడలతో దర్శనమిచ్చే పాఠశాల ప్రస్తుతం రంగులతో పాటు మహనీయుల చిత్రాలతో ఆకట్టుకుంటోంది. పాఠశాల ముఖద్వారం మొదలుకుని ఆవరణలోని స్టేజీ, ఆ పక్కనే గౌతమ బుద్ధుడు, సరస్వతి విగ్రహాలను ఏర్పాటు చేయించారు ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి. 'ఇంటికి వంద- బడికి చందా' అంటూ గ్రామస్తులు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేలా చేసి విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారు. కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫారాలు, క్రీడాదుస్తులు అందించారు. ప్రభుత్వ పాఠశాలంటే ఇలా ఉండాలని అనే రీతిలో తీర్చిదిద్దారు.

అందరి తోడ్పాటుతోనే..



గ్రామస్తులందరి తోడ్పాటుతోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమైంది. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, విద్యాకమిటీ సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేశారు. వారందరి ప్రోద్బలంతోనే పాఠశాలను అనుకున్న స్థాయిలో ఆదర్శంగా ఉండేలా మార్చగలిగాం. పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తోడ్పాటునందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– విజయభాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, మజీద్‌పూర్ జెడ్పీహెచ్‌ఎస్

గురువుల ప్రోత్సాహంతో..



విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

కొందుర్గు: మండల పరిధిలోని చెర్కుపల్లి పాఠశాల నుంచి ఏటా నాలుగో తరగతి చదివే విద్యార్థులు 5వ తరగతికి ఎంపిక కావడం విశేషం. ఇప్పటివరకు 95 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందారు. ఈ పాఠశాలలో పదేళ్లుగా 5వ తరగతిలో విద్యార్థులు ఉండరు. కేవలం 4వ తరగతి వరకే కొనసాగుతోంది. 4వ తరగతి చదివే విద్యార్థులంతా గురుకుల ప్రవేశం పొంది వెళ్లిపోతారు. పాఠశాలలో పనిచేస్తున్న శివారెడ్డి, మల్లికార్జున్ కృషి.. దాతల సహకారంతో పాఠశాలలో ఫ్లోరింగ్ చేశారు. వలంటీర్‌ను నియమించుకొని విద్యాబోధనకు ఆటంకం లేకుండా చూసుకుంటున్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారానికి రాకేష్‌భవానీ



ఇబ్రహీంపట్నం: గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారం అవార్డుకు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డా. చింతల రాకేశ్‌భవానీ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాకేష్‌భవానీ కవిగా, రచయితగా, గాయకుడిగానే కాకుండా అకడమిక్స్, రీసెర్చ్, సామాజిక సేవా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. నగరంలోని రవీంద్రభారతిలో గురువారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు.

శభాష్ .. సురేష్ సార్



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి మంత్రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సురేష్

ఇబ్రహీంపట్నం: సర్కార్ బడి అంటేనే రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న తరుణంలో ఆ పాఠశాల అభ్యున్నతికి, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కృషి చేశాడు ఆ ఉపాధ్యాయుడు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాగాకు సురేష్ ప్రధానోపాధ్యాయుడిగా ఆగస్టు 2020 నుంచి సెప్టెంబర్ 2023 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఆ సమయంలో 6 నుంచి 10వ తరగతి వరకు 350 మంది విద్యార్థులున్నారు.

పాఠశాలలో మార్పులు ఇలా..

- ఒక పీఈటీని, విద్యావలంటీర్‌ని తన సొంత డబ్బులు వెచ్చించి రెండున్నరేళ్లపాటు నియమించుకున్నారు.
- పలువురు దాతలను ఆశ్రయించి వారి సహకారంతో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేయించారు.
- అన్ని తరగతి గదుల్లో సైన్స్ పెయింటింగ్‌లు వేయించారు.
- విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, బ్యాగులు, షూ అందేలా కృషిచేశారు.
- పాఠశాలలో కొత్తగా ఒకేషనల్ కోర్సులు (అగ్రికల్చర్, ఎలక్ట్రానిక్స్) ఏర్పాటు చేశారు.
- స్వచ్ఛంద సంస్థలను ఆశ్రయించి పాఠశాలలో విద్యార్థులందరికీ రోబోటిక్స్ ల్యాబ్ ఏర్పాటు చేసి తరగతులు నిర్వహించారు.
- నేషనల్ ఇన్నోవేషన్ మిషన్‌లో ఈ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దారు.
- పదో తరగతిలో ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.
- జాతీయ స్థాయిలో 8 మంది విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పొందుతున్నారు.
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అదనపు తరగతుల ఏర్పాటుకు కృషిచేశారు.
- పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి చెట్లను పెంచారు.

వరించిన రాష్ట్ర స్థాయి అవార్డు

ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూ వచ్చింది. ఈ విద్యాసంవత్సరం ఈ పాఠశాలలో 8,9,10 తరగతుల్లో సీట్ల కోసం పోటీ పెరిగింది. ప్రస్తుతం 550 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఆయన అదే పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈసారి పదో తరగతి పరీక్షల్లో వంద శాతం విద్యార్థులు గణితంలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. 2023లో రాష్ట్ర స్థాయితో ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేష్ అవార్డు అందుకున్నారు.

రోడ్డు కబ్జాకు యత్నం


పెద్దఅంబర్‌పేటలో కాలనీలకు వెళ్లే దారికి అడ్డంగా ఏర్పాటు చేసిన కంటైనర్


వివరాలు తెలుసుకుంటున్న సీఐ నాగరాజు, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

- అడ్డంగా కంటైనర్ ఏర్పాటు
- పనులను అడ్డుకున్న స్థానికులు

అబ్దుల్లాపూర్‌మెట్: పలు కాలనీలకు వెళ్లే ప్రధాన దారిని కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు యత్నించారు. బుధవారం తెల్లవారుజామున పదుల సంఖ్యలో మహిళా కూలీలతో వచ్చి రోడ్డుకు అడ్డంగా భారీ కంటైనర్‌ను వేయడంతో పాటు రెండు వైపులా ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు యత్నిస్తుండడంతో కాలనీలవాసులు అడ్డుకున్నారు. దీంతో పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో బృందావన్‌హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో(సర్వేనంబర్ 175) రోడ్డును వేశారు. దాదాపు 25 ఏళ్లు కావస్తున్నప్పటికీ ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ రోడ్డును కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఆపిల్ అవెన్యూ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డితో పాటు వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి, ఇరు పక్షాల వద్ద నుంచి పత్రాలను తీసుకున్నారు. వివాదం పరిష్కారమయ్యే వరకు ఇక్కడ ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదని సీఐ హెచ్చరించారు.

చెరువులను పరిరక్షించండి

ఇబ్రహీంపట్నం: చెరువులను, కుంటలను కబ్జాల బారి నుంచి పరిరక్షించాలని మత్స్య కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సమావేశం బుధవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రియల్ ఎస్టేట్, పట్టణీకరణ, పరిశ్రమల పేరుతో చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో రూ.500 కోట్లు ఖర్చుచేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఉచిత చేప పిల్లల పథకాన్ని కొనసాగిస్తూ మత్స్య సొసైటీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, జంగయ్య, శ్రీనివాస్, రాజులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీ

శంకర్‌పల్లి: భవన నిర్మాణానికి సంబంధించిన సెంట్రింగ్ సామగ్రి చోరీ అయిన సంఘటన బుధవారం మోకిల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిలలోని సార్క్ శేషాద్రి వెంచర్‌లో బిల్డింగ్ నిర్మించేందుకుగాను సెంట్రింగ్ సామగ్రిని మంగళవారం తీసుకువచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో రూ.2 లక్షలు విలువ గల సెంట్రింగ్ సామగ్రిని అపహరించుకెళ్లారు. వెంచర్ మేనేజర్ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన పోలం శ్రీశైలం(40) శుభకార్యం నిమిత్తం తలకొండపల్లి మండల కేంద్రానికి బైక్‌పై మధ్యాహ్నం వచ్చాడు. విందులో ఉండగా తెలిసిన వారిని తీసుకొద్దామని బైక్‌పై తలకొండపల్లి క్రాస్ రోడ్డుకు బయలు దేరాడు. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పింది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీశైలంకు తీవ్ర గాయాలవ్వగా చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి బావ పర్వతాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వరద నష్టాన్ని అంచనా వేయాలి

సమీక్షలో కలెక్టర్ శశాంక


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి, నష్టాన్ని అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. త్వరితగతిన నివేదికను సిద్ధం చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్తి, ప్రాణ నష్టాలను అంచనా వేయాలన్నారు. ఎటు వంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. వరదలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల వివరాలను నమోదు చేయాలని తెలిపారు. తెగిపడిన కాల్వలు, కుంటలు, చెరువు కట్టలపై కూడా నివేదిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి సంగీత, డీపీఓ సురేశ్‌మోహన్, వ్యవసాయ అధికారి నర్సింహ, ఇరిగేషన్, విద్యుత్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడినే పూజిద్దాం

మట్టిని దేవునిగా చేద్దాం.. భక్తిని పూజగా అర్పిద్దామని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడిని వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ని నిర్మూలించే దిశగా మట్టితో చేసిన గణనాథులను ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీరు శ్రీవాత్సవ్, ఏఈఎస్ మహేశ్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించండి

- గ్రామాలు, పట్టణాల్లో నిఘా పెంచండి
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు


పహాడీషరీఫ్: బాలాపూర్ గణేశ్ మండపాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మహేశ్వరం: పోలీస్‌స్టేషన్లకు వచ్చే సామాన్య ఫిర్యాదుదారుల సమస్యలపై వెంటనే స్పందించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పోలీసులను ఆదేశించారు. డీసీపీ సునీతారెడ్డితో కలిసి బుధవారం ఆయన మండల కేంద్రంలోని పీఎస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చౌరస్తాలు, గ్రామ నడిబొడ్డున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి, నిఘా పెంచాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించకూడదని దిశానిర్దేశం చేశారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అంతకు ముందు పీఎస్ పరిసరాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. పెట్రోలింగ్ స్టాఫ్, రిసెప్షన్, సీసీ టీవీల నిర్వహణ తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రైమ్ వివరాలు, కేసుల నమోదు అంశాలపై ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలతో చర్చించారు.

బాలాపూర్‌లో సీపీ పర్యటన

పహాడీషరీఫ్: ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన బాలాపూర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంతో పాటు నిమజ్జనాన్ని ప్రణాళిక ప్రకారం జరిగేలా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. మండప ఆవరణలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తత

డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం శివరాంపల్లి డీఎంహెచ్ఓ కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సూపర్ వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీరు, గాలి ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం దోమల ద్వారా డెంగీ జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. డెంగీ నిర్ధారణ అయితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత వైద్యులపైనే ఉందన్నారు. 2022లో 765 డెంగీ కేసులు నమోదు కాగా, 2023లో 543 కేసులు, 2024లో ఇప్పటి వరకు 210 కేసులు మాత్రమే నమోదయ్యాయని చెప్పారు. ఫీవర్ సర్వే చేపట్టి, బాధితులను గుర్తించాలని సూచించారు. దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించడంతో పాటు వందశాతం వ్యాక్సినేషన్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

నిబంధనలు తప్పనిసరి

- గణేశ్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు
- శంషాబాద్ డీసీపీ రాజేశ్


ఆమనగల్లు: మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్

ఆమనగల్లు/కడ్తాల్: పండగలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రభుత్వ మార్గ దర్శకాలకు లోబడి నిర్వహించాలని మండపాల నిర్వాహకులను ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో బుధవారం గణేశ్ నవరాత్రి, నిమజ్జనం ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. మండపాల ఏర్పాటు కోసం ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటుపై పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని, అప్పుడే బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మండపాల వద్ద, గణేశ్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలకు చోటులేకుండా విద్యుత్ శాఖ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. మండపాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దన్నారు. సమావేశంలో సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, తహసీల్దార్ లలిత, ఎంపీడీఓ కుసుమమాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత, మైనర్ ఇరిగేషన్ ఏఈ తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, వివిధ పార్టీల నాయకులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు కడ్తాల్‌లో జరిగిన కార్యక్రమానికి డీసీపీ హాజరయ్యారు. తహసీల్దార్ ముంతాజ్, సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్, నాయకులు దశరథ్‌నాయక్, లక్ష్మీనర్సింహారెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, జానీమియా, జహీరుద్దీన్, పరమేశ్ మండపాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి.. యువకుడి మృతి

మృతుడి కళ్లు దానం చేసిన కుటుంబసభ్యులు


ప్రశాంత్ (ఫైల్)

నందిగామ: చేతికొచ్చిన కొడుకు దుర్మరణం చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇన్నేళ్లు కష్టపడి పెంచిన తమ కుమారుడిని రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించడంతో గుండెలవిసేలా రోదించారు. అయినా తమ కొడుకుని సజీవంగా ఉంచేందుకు వారు సన్నద్ధమయ్యారు. మృతి చెందిన ఆ యువకుడి కళ్లను దానం చేసి ఆదర్శంగా నిలిచారా దంపతులు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేకగూడ గ్రామానికి చెందిన సంగెం ప్రశాంత్(29) సోమవారం సాయంత్రం కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి కింద పడ్డాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో యువకుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దుఃఖాన్ని దిగమింగుతూ.. చనిపోయిన తన కొడుకు కళ్లను దానం చేయాలని భావించారు. వెంటనే ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి సమాచారం ఇచ్చి రెండు కళ్లను దానం చేసి ఆదర్శంగా నిలిచారు.

బాలిక అదృశ్యం

చేవెళ్ల: మానసిక పరిస్థితి సరిగా లేని 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ దస్తగిరి చెల్లెలు ఫారీదాబేగం (16)కు మానసిక పరిస్థితి బాగాలేదు. ఆమె మంగళవారం రాత్రి ఇంట్లో అందరితో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. అర్ధరాత్రి తన అన్న లేచి చూసేసరికి పడుకున్న చోట ఫారీదాబేగం కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం దస్తగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు


నిసాన్ బీబీ (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సూరజ్, నీరూన్ నిసాన్ బీబీ(23) దంపతులు. వీరు ఏడాది క్రితం తుక్కుగూడకు వలసవచ్చి నివాసం ఉంటున్నారు. నెల క్రితం దంపతులు గొడవ పడగా.. భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగి ఆమె తన సోదరుడు సికిందర్‌తో కలిసి గత నెల 31న భర్త దగ్గరికి వచ్చింది. ఈ నెల 1 తేదీన బావ, బావమరుదులు పని మీద వెళ్లగా ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంది. రాత్రి వచ్చి చూడగా కనిపించలేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఒడిశాకు చెందిన మీరాన్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

గురువులకు వందనం

ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించిన అధికారులు


రాధిక, శ్రీనివాస స్కూల్, కొంగరకలాన్


వెంకటేశ్వరదీక్షిత్, పీఎస్, తులేకలాన్


బీకేఎల్ లక్ష్మి, ప్రాథమిక పాఠశాల, ఉప్పరిగూడ


క్రాంతికుమార్, జెడ్పీహెచ్ఎస్, తలకొండపల్లి


మురళీకాంత్, జెడ్పీఉన్నత, జిల్లెలగూడ


జంగయ్య, బాలుర ఉన్నత పాఠశాల, కడ్తాల్


జ్యోతిగౌడ్, ముట్పూరు, జెడ్పీహెచ్ఎస్


శంకర్, యూపీఎస్, తుమ్మలపల్లి

సమాజంలో గురువుల పాత్ర వెలకట్టలేనిది. బాల్యం నుంచే చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి తీవ్రంగా శ్రమిస్తారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా ఉత్తమ గురువులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ఎంపికైన ఉపాధ్యాయులను జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ప్రకటించారు.

– సాక్షి, నెట్‌వర్క్


శ్రీధర్, ఎస్‌జీటీ, చేవెళ్ల


సునీత, ఎస్‌జీటీ, ఊరేళ్ల


కళావతి, జెడ్పీహెచ్ఎస్, గుండాల


రజిత, పీఎస్ మహదేవ్‌పూర్


మంజులత, సరూర్‌నగర్ బొమ్మనగండి ఉన్నత


శ్రీదేవి, బాలికల ఉన్నత పాఠశాల, మహేశ్వరం


పద్మావతి, జెడ్పీహెచ్ఎస్, తుక్కుగూడ


యాదయ్య, ఉన్నత పాఠశాల, అమీర్‌పేట్


రూపాన్సీ, బాలికల ఉన్నత పాఠశాల, అమీర్‌పేట్


మహేష్, ప్రైమరీ స్కూల్, అమీర్‌పేట్


పాండు, ప్రైమరీ స్కూల్, మహేశ్వరం

కందుకూరులో 8 మంది..

కందుకూరు: లేమూరు జెడ్పీహెచ్ఎస్ నుంచి నర్సింహ, నేదునూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీధర్, కొత్తగూడ యూపీఎస్ నుంచి సుభాష్‌రెడ్డి, రాచులూరు జెడ్పీహెచ్ఎస్ నుంచి సురేందర్‌రెడ్డి, గూడూరు పీఎస్ నుంచి శ్రీదేవి, కందుకూరు పీఎస్ నుంచి నవనీత, కటికపల్లి పీఎస్ నుంచి వెంకట్‌రెడ్డి, నోబుల్ స్కూల్ నుంచి జక్కుల రాజును ఎంపిక చేశారు.

మొయినాబాద్‌లో ఏడుగురు..

మొయినాబాద్: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ పండిట్ బిలాల్, హిమాయత్‌నగర్, వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల గణితం ఉపాధ్యాయులు డి.విజయ్‌కుమార్, తుకారామ్, అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ సక్కుబాయి, ముర్తూజగూడ ప్రాథమికోన్నత పాఠశాల, చాకలిగూడ, నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలల ఎస్‌టీజీ ఉపాధ్యాయులు ఎల్.విజయబాయి, కె.సుజాత, మల్లేశం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.


జయప్రకాశ్‌రెడ్డి, దేవేందర్ విద్యాలయ, తుక్కుగూడ


ఆంజనేయులు, మంఖాల్ ఉన్నత